
# గవర్నమెంటు కథలు నం:1



"చదువుకున్న వాడికన్నా చాకలే మేలు."-ఈసామెత రాజయ్యకు తెలుసు. కాని ఆ సామెతలో అతనికి నమ్మకంలేదు.

'నల్గురుసదూకు నోళ్ళుండబట్టె నాల్గు ఇస్త్రీ బట్టలు పడతన్నాయ్. నాల్గుడబ్బులు కిడతన్నాయ్'. అను కుంటా డతను.'

రాజయ్య వుంటున్న 'షాపు' అనబడే 'ఇల్లు' అనబడే 'షాపు' అతనిదికాదు. అతనందులో, అద్దె కుంటున్నాడు. ఓనర్‌కి కోపమొచ్చి

# ఇలాగే జరుగుతోంది

— వీరభద్రరావు పత్రి



నప్పుడల్లా, 'సాపు కాలీసెయ్‌రా నంజ కొడకా!' అని ముద్దుగా చెప్తాడు. రాజయ్య కోప్పడడు. బతిమాల్తాడు. ఓనర్ తన నోటీసు ఉపసంహరించుకుంటాడు. అంమలో అతను ఊరికే ఉండటం లేదనీ, నెలకి అక్షరాలా అరవై రూపాయలు అద్దెకడుతున్నాడనీ రాజయ్యకే కాదు ఓనర్కీ తెలుసు. తోటి మనిషికున్న అవసరం మీద ఆడుకునే ఈ దేశపు మనిషి- ఓనరు. రాజయ్య ట్రేడ్ యూనియనిష్టుకాడు. అందుకని

ఓనర్తో పేచీపెట్టుకోడు. బతిమాలి పబ్బం గడుపుకుంటాడు.

తాతల్నాటి ఇస్త్రీబల్ల (దాని నాలుగో కాలు కుంటిది- ఈదేశంలో ధర్మంలాగ) తండ్రిచ్చి పోయిన ఇస్త్రీ పెట్టె, తను 'వయసు'లో వున్నప్పుడు కొనుక్కున్న అద్దాలూడి పోయిన బీరువా, కాళ్ళుకడిగి మామ ఇచ్చిన పెళ్ళాం, ఆమె పిగ్గు నిగ్గుల్ని చవి చూపినందుకు ఆమె ప్రసాదించిన ఆర్గురు పిల్లలు- రాజయ్యకున్న ఆస్థులు.

అందరిబట్టలూ ఉతికే రాజయ్య కెప్పుడూ ఒంటిమీద చొక్కా వుండదు. అతని పిల్లల్లో ముగ్గురికి లాగూలుచొక్కాలు కూడావుండవ్. 'ఎందుకుండవ్?'అని అతనెప్పుడూ ఎవర్నీ ప్రశ్నించలేదు. ప్రశ్నించడం తెలియని అతనికి, ప్రశ్నించినా ఫలితం వుండదన్న సంగతి కూడా తెలియదు.

ఆ ఒక్క గదిలోనే అతను లాండ్రీ షాపు నడుపుతాడు. అందులోనే అతనిభార్య రెండు పూట్లా ఇంత గంజి కాస్తుంది. అందులోనే అతని పిల్లలు ఎండగా వున్నప్పుడు వర్షం వస్తున్నప్పుడుబువ్వాలాట్లాడుకుంటారు. అందులోనే వాళ్ళంతా రాత్రిళ్ళు మామిడిపళ్ళు పేర్చినట్టు పడుకుంటారు. అందులోనే ఎప్పు డేనా అలసినఒళ్ళు అలజడి చేస్తే అతను భార్యతో కాపురం చేస్తాడు.

రాజయ్య ఎకానమిస్టు కాడు. 'మేం ఇంత కష్టపడతా వుంటే ఇంతే ఫలితం వస్తోందేం?' అని ఎప్పుడు ప్రశ్నించుకోలేదు. 'ఏదో ఇంత గంజి దొరికితే సాలు' అనుకుంటాడు.

అతని భార్య మాలచ్మి- పుట్టిన తర్వాత నీడ ఎరగనిదాన్లా నల్లగా వుంటుంది. ఆ నలుపులో వింత మెరుపుంది. గంజిమాత్రం తాగే ఆమె ఒంట్లో కాయ కష్టం తాలూకు సత్తువుంది. కష్టపడితేతప్ప జరుగుబాటు లేదన్న నమ్మకంవుంది. పిల్లలంటే ప్రేముంది. మొగుడంటే ఇష్టం వుంది.

ఆమె పొద్దుట్నుంచి సాయంత్రందాకా రేవులోబట్టలుతుకుతుంది. రాజయ్య షాపులో బట్టలు ఇస్త్రీ చేస్తాడు. కాస్త ఎదిగిన పిల్లలు తల్లికి తండ్రికి సాయంచేస్తారు.

రాజయ్య- జీవితాన్ని తృప్తి, అసంతృప్తి అని ఎప్పుడూ విడదీసి చూడలేదు. అతను సగటున రోజు పది పన్నెండు రూపాయలు సంపాయిస్తాడు. ఓ రోజు పన్నెండు రూపాయలు రావచ్చు, మరో రోజు రెండే రావచ్చు. బొగ్గులు, సోడా, నీలిమందు వగైరా ఖర్చులు పోను

పిల్లలికి ఇంతపోసి-తనూ, పెళ్ళాం కొ_స్త గంజి తాగ్గలిగితే అతనా .రోజు హాయిగా నిశ్చింతగా నిద్ర పోతాడు. కొ_స్త సంపాదన ఎక్కు_వగా ఉన్నప్పుడు కొంచెం సారా తాగుతాడు.ఆరోజుమరింతహాయిగా భార్యని పులకింపిజేసి మరీ నిద్ర పోతాడు.

అతనికి రేవు మీద తప్పితే, రేపుమీద నమ్మకంలేదు, ఆశల్లేవు, ఆలోచించడు. వర్తమానానికి గ్యారంటీ లేని మనుష్యులు భవిష్యత్తు గురించి ఆలోచించరు- ఆలోచించలేరు.

మాలచ్చికిమాత్రం తన పిల్లలు కూడా అందరి పిల్లల్లాగే చిన్నచిన్న లాగూలు, చిన్నచిన్న చొక్కా_లు తొడుక్కు_ని స్కూ_లుకు వెళ్ళాలనీ, చదువుకోవాలనీ ఆశ పుడుతూంటుంది. అదేమాట మొగుడితో అంటే 'ఈళ్ళు సదూకుని ఉద్యోగాలు సెయ్యాలా- ఊళ్ళేలాలా? మనలాగే నాల్గు గుడ్డలుతుక్కు_ని గంజినీళ్ళు సంపాయించు కుంటే సాలు'. అంటాడు.

* * *

రాజేశ్వరావు చదువుకున్నాడు. అతను బి. ఏ. చదువుకుంటున్నప్పుడు కాని, అంతకు ముందు కాని, 'చదువుకుని ఉద్యోగం చెయ్యాలా- ఊళ్ళేలాలా?' అని ఆలోచించ లేదు. తల్లిదండ్రులు చదువుకోమన్నారనీ, తోటీవాళ్ళు చదువుకుంటున్నారనీ- అతనూ చదువుకున్నాడు. జులాయిగా తిరక్క_పోయినా- అతను బరువుల బాధలకు, బాధ్యతల సంకెళ్ళకు దూరంగా గడిపాడు.

అతను ఒక్కొ_క్క_ క్లాసు పూర్తి చేసినప్పుడల్లా జీవితంమీద ఆశ, భవిష్యత్తుమీద నమ్మకం పెరగడం ప్రారంభించాయి. తీరా బి. ఏ. రిజల్టు వచ్చి సెకండ్ క్లాసులో పాసయ్యాడన్న విషయం తెలియగానే, అతను ప్రపంచమనే కొండమీద శిఖరం ఎక్కి_ కూర్చున్నట్టు ఫీలయ్యాడు.

అప్పుడతనికి 'ఉద్యోగం చెయ్యాలా- ఊళ్ళేలాలా?' అన్న ఆలోచన వచ్చింది. ఊళ్ళేలా లంటే ముఖ్యంగా డబ్బు, పలుకుబడి, కులపు సహకారం, నల్లటి గతం ఉండి తీరాలన్న విషయం అర్థమైంది. అవేవీ తనకు లేవని అతనికి తెలుసు. ఆ ఆలోచన విరమించుకుని ఉద్యోగమే చెయ్యాలన్న నిర్ణయానికి వచ్చాడు.

రాజేశ్వర్రావుకి నీతిగా, నిజాయితీగా బతకాలన్న అత్యాశ ఎక్కు_వ. కాబట్టి అతను బి. ఏ. లో సెకండ్

క్లాసు తెచ్చుకున్నా, ఏ ఉద్యోగమూ కొనుక్కోలేకపోయాడు. రెండేళ్ళు గడిచినా, 'ఇక్కడో ఉద్యోగం వుంది. అది మీరు తప్ప మరెవ్వరూ నిర్వహించలేరు. మీ సేవలు మాకు చాలా అవసరం. వెంటనే వచ్చి చేరండి' అని ఎవరూ అతన్ని ఆహ్వానించలేదు.

తన కుటుంబంలోని ఆరుగురూ తన తండ్రి కున్న రెండే రెండు రెక్కలమీద ఆధారపడి బతకడం చూసి అతను చలించిపోయాడు. తన భవిష్యత్తు గురించి- తండ్రికి సాయపడాలనే తన ఆలోచన గురించి-అతను తీవ్రంగా యోచించాడు. చివరికి ఓ నిర్ణయానికి వచ్చి, తన తల్లిదండ్రులకు తెలియపరిచాడు. వాళ్ళు కూడా ఒప్పుకున్నాక మర్నాడే ఆ వూళ్ళో వున్న బాంక్ కి వెళ్ళి ఏజంట్ ని కలిశాడు.

రాజేశ్వర్రావు చెప్పినదంతా విన్నాక ఏజంట్ అతనికి స్వయం ఉపాధికల్పన కింద అప్పు ఇవ్వడానికి అంగీరించాడు. కాని తను పెట్టబోయే వ్యాపారాని క్కావల్సిన పెట్టుబడిలో ఐదో వంతు అతను పెట్టాలి—— మిగిలింది బాంకే ఋణంగా ఇస్తుంది. ఆ సొమ్ముకి ఏదైనా స్థిరాస్థి గ్యారంటీ చూపెట్టాలి.

ఇంటికొచ్చి అతను తల్లిదండ్రులకి వివరంగా విషయమంతా చెప్పాడు. తన నగలు తాకట్టుపెట్టి అతని వాటా పెట్టుబడికి డబ్బు ఇవ్వడానికి అతని తల్లి ఒప్పుకుంది. తండ్రి తనకున్న పెంకుటిల్లు గ్యారంటీ ఇస్తానన్నాడు.

రాజేశ్వర్రావుకి చాలా ఆనందంగా వుంది. కాని, ఏ వ్యాపారం పెట్టాలి- అన్నది అతని సమస్య...

అతను పెట్టబోయే వ్యాపారానికి మంచి గిరాకీ వుండాలి. అలాంటిది ఆ పట్నంలో మరొకటి వుంటే గిరాకీ వుండదు. దాని మీద వచ్చే డబ్బుతో అతను సులభంగా బాంక్ కి వాయిదాలు నెల నెలా కట్టేటట్టు వుండాలి- ఇవన్నీ బాంక్ వారు పెట్టిన నిబంధనలు.

బాంక్ ఏజంట్ తోటి, మిత్రుల తోటి ఆలోచించి ఆ వూళ్ళో డ్రైక్లీనింగ్ లాండ్రీ పెట్టడానికి నిర్ణయించాడు- అలాటిది అక్కడ మరోటి లేదు. కొత్తగా జూనియర్ కాలేజీ పెట్టిన కారణంగానూ, పదిమైళ్ళ దూరంలో ఏదో ప్రాజెక్టు కట్టాలన్న ఉద్దేశంతో- దానికి సంబంధించిన ఇంజినీరింగ్ సర్వే ఆఫీసు అక్కడ వెలుస్తున్నందు వల్లా, అతని వ్యాపారానికి మంచి గిరాకీ వుంటుందని రాజేశ్వర్రావు

ఆలోచన. బాంక్‌వారు దానికి అంగీకరించారు.

రాజయ్య షాపున్న వీధిలోనే ఓ ఫర్లాంగు దూరంలో 'మహాత్మా డ్రైక్లీనర్స్' వెలిసింది. ప్రారంభోత్సవంనాడు పొద్దున్నే రాజేశ్వ్రరావు ఆ వీధిలోనే ఉన్న ఆంజనేయుని గుడికెళ్ళి- తనని, తన వ్యాపారాన్ని ఓ ఒడ్డుకు చేర్చమని మొక్కుకున్నాడు. ఊళ్ళో పెద్దలు, బాంక్ స్టాఫ్ ప్రారంభోత్సవానికి వచ్చి, రాజేశ్వర్రావు ప్రయత్నం సఫలం కావాలనీ, అతను మరో పదిమంది నిరుద్యోగ యువకులకు ఆదర్శప్రాయుడు కావాలనీ, ఉపన్యాసించారు. ఆ రోజంతా అక్కడ గ్రామఫోను రికార్డులమోత దద్దరిల్లిపోయింది.

ఈ ప్రారంభం చూసి రాజయ్య తన పొట్టమీద ఎవరో కొట్టబోతున్నట్టు ఉలిక్కిపడ్డాడు. తన పిల్లలకి గంజినీళ్ళు కూడా కరువవుతాయని భయపడ్డాడు- అలా కాకూడదని ఆ వీధిలో ఆంజనేయస్వామికి దణ్ణమెట్టి కోరుకున్నాడు.

* * *

నెల తిరిగింది.

మొదట్లో ఏ మాత్రం ఉత్సాహంగాలేని రాజేశ్వర్రావువ్యాపారం కాస్తపుంజుకుంది. కాలేజీస్టూడెంట్లు, ఉద్యోగస్తులు-బట్టలు డ్రైక్లీనింగ్‌కి వెయ్యడం మొదలెట్టారు. తన జీవితం చీకటిమయం కాదని, వెలుగులోకి తనూ తొంగిచూసే అవకాశము వుందని- రాజేశ్వర్రావు ఆశపడ్డాడు.

రాజయ్య సంపాదన మాత్రం తగ్గింది. రోజూ పదిపన్నెండు రూపాయలొచ్చే అతని సంపాదన ఐదారు రూపాయలకి పడిపోయింది. డ్రైక్లీనింగ్ మోజువల్ల కొందరు, త్వరగాతయారవుతాయని కొందరు, అతని ఖాతాదారులు డ్రైక్లీనింగ్‌కి వెయ్యడం మొదలెట్టారు. రాజయ్య కలవరపడ్డాడు. ఇహ తన జీవితం చీకట్లోకి వెళ్ళిపోతుందన్న భయం పట్టుకుందతన్ని.

మరి కొన్నాళ్ళు పోయేటప్పటికి రాజేశ్వర్రావుకి వ్యాపారం ఆశాజనకంగా కనబడ్లేదు. మొత్తం మీద చూస్తే ఆ వూళ్లో డ్రైక్లీనింగ్ అవసరం తక్కువే. పైగా రేట్లు జనానికి చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయ్. ఆ మాత్రం రేట్లు లేకపోతే తనకసలు కిట్టదు. అతని కుటుంబ వృత్తి బట్టలుతకడం కాదు. అంచేత ఇద్దరు జీతగాళ్ళని పెట్టుకోవాల్సి వచ్చింది. వాళ్ళకి జీతాలివ్వాలి, కొట్టుకుఅద్దెకట్టాలి, కరెంటు కట్టాలి, పంచాయితీ టాక్సులు

కట్టాలి. మామూళ్ళు యిచ్చుకోవాలి. ఇవన్నీ కాకుండా బాంక్ కి అప్పు తాలూకు వాయిదాలు కట్టాలి.

షాప్ పెట్టిన మూడు నెలలకే అతనికి వెయ్యి రూపాయల నష్టం వచ్చింది. తీరా దిగాక విరమించు కోడాన్కి వీల్లేదు. షో కేస్ లకి, షాపు అలంకరణకి ఖర్చు చేసిన దంతా వృధా అయిపోతుంది. పైగా అప్పటికే వెయ్యి రూపాయల నష్టం. అతనికి ఏం చెయ్యాలో తెలియడంలేదు. బెంగ పట్టుకుంది. అమ్మబోతే అడివి- కొనబోతే కొరివిలా వుంది అతని వ్యాపారం.

రాజయ్య కుటుంబాన్కి గంజి క్కూడా చాలడంలేదు అతని సంపాదన. చాలా ఆలోచించిన మీదట కొన్ని విషయాల్లోనైనా డ్రై క్లీనింగ్ తో పోటీపడకపోతే తనకు మనుగడ లేదన్న నిర్ణయానికి వచ్చాడతను.

మర్నాడే ఆ ఊళ్ళో వున్న మార్వాడీ దగ్గరకెళ్ళి ఎనిమి దొందలు ఎక్కువ వడ్డీకి అప్పు తెచ్చాడు. ఆ డబ్బుతో మరో ఇస్త్రీ పెట్టె కొన్నాడు. ఓ బల్ల కొన్నాడు. ఓ అద్దాల బీరువా కొన్నాడు. తన ఖాతాదారులకి త్వరగా బటలు అందించడానికి ఓ నౌకర్ని పెట్టాడు. ఇదంతా చేసినా రాజయ్య సంపాదన పదిహేను రూపాయలికి మించి ఏ రోజూ పెరగలేదు. అందులోనే జీతగాడికివ్వాలి. మార్వాడీకి వడ్డీ కట్టాలి. వెరసి ఫలితం- మళ్ళీ మామూలే-తన కుటుంబానికి గంజి కోసం ఆరాటం.

ఆర్నెల్లు తిరిగేసరికి రాజయ్యకు, రాజేశ్వర్రావుకి- ఇద్దరికీ బతుకు శూన్యంగా కనిపించింది.

నాలుగునెలలుగా బ్యాంక్ కి వాయిదాలు కట్టలేదని రాజేశ్వర్రావు షాపులో షోకేసులు, డ్రైక్లీనింగ్ పరికరాలు బాంక్ వారు తీసుక పోయారు కోర్టుద్వారా....మిగిలిన డబ్బు ఇల్లు అమ్మి కడతానని అతని తండ్రి ఇచ్చిన హామీ ఫలితంగా ఇల్లు జప్తు చెయ్యకుండా వదిలి పెట్టారు.

మూడు నెలలు వరుసగా అసలు కాని, వడ్డీ కాని కట్టని నేరానికి రాజయ్య 'షాపులో' అద్దాలబీరువా, కొత్త ఇస్త్రీ పెట్టే కాకుండా అతని తండ్రిచ్చిన పాత ఇస్త్రీ పెట్టెకూడా మార్వాడీ పట్టుకుపోయాడు.

ఈ రెండు జరుతున్నప్పుడు గుళ్ళో ఆంజనేయస్వామి గుళ్ళోనే

ఉన్నాడు. మరో భక్తుడి కోర్కెలు జాగ్రత్తగా వింటున్నాడు.

* * *

ఆ రాత్రి భయంకరంగావుంది.

ఉరుములు, మెరుపులేకాకుండా ఆకాశంపగిలినట్టు వర్షం కురుస్తోంది. రాజయ్య పిల్లలు చలికి వణుకుతూనే నిద్దరోతున్నారు.

అతనికి, పెళ్ళానికి నిద్రరావడం లేదు.

మర్నాటినుంచిగంజి సమస్య.: లేదా మరో-చాకలి దగ్గర అతను కూలీగా చేరాలి.

"మనం ఎవుళ్ళి కన్యాయం చేసాం మావా....ఇలా గంజికూడా నోచుకోకుండా పోతన్నం" అంది మాలచ్మి.

"అది మన తప్పుకాదే...డ్రై క్లీనింగ్ సాపుకి ఋణమిచ్చిన బాంకోళ్ళతప్పు"అన్నాడు రాజయ్య.

"మద్దెలో ఆళ్ళేం చేసారు?" మాలచ్మి అమాయకంగా అడిగింది. రాజయ్య నవ్వాడు - రహస్యాలన్నిటినీ ఛేదించిన వేదాంతిలా నవ్వాడు.

"ఒకూళ్ళో వంద రిచ్చాలున్నాయనుకో! ఆళ్ళు రోజుకి తలా ఆర్రూపాయలుసంపాయిత్తారనుకో! రిచ్చా అద్దె రెండూ పోను, నాల్గు రూపాయలు ఒక్కొక్కడికిమిగుల్తాయి. దాంతో రిచ్చావోళ్ళు, ఆళ్ళ పెళ్ళాం పిల్లలు గంజితాగుతారు. అదే వూళ్ళోకిబాంకోళ్ళు అప్పులిచ్చిమరో వంద రిచ్చాలు అరిజెంటుగా దింపేశారనుకో-ఏటౌద్ది?"

మాలచ్మి తెల్లమొహంవేసింది. "ఎటౌద్దో నువ్వే జెప్పు"అందామె.

"ఒక్కసారిగా ఊల్లోకి మరో వంద రిచ్చాలొచ్చాయి కదాని రిచ్చా ఎక్కేనాయాళ్ళు పెరగరు కదా! ఒకేళ ఆల్లని పెంచాలంటే రూపాయి తీసుకునే దూరానికి ముప్పావలా తీసుకోవాలి- అంటే అదే సొమ్మును రెండొందలమంది పంచుకోవాలి. అప్పుడు ఒక్కొక్కడికి తలా మూడో నాలుగో వత్తాయి. అందుకని పాత రిచ్చావోల్లకీ కూడుండదు, కొత్తోల్లకీ ఉండదు. అదే రగస్యం."

మాలచ్మికేం అర్థంకాలేదు. అర్ధమయినట్టు తలూపింది.

"నువ్వు బలే తెలివైనోడివి మావా! నాకు ఇంత ఆలోచన రాలేదు" అంది.